# మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అసలు పేరు మొహియుద్దీన్ అహమ్మద్. భారత స్వాతంత్ర్యోద్యమ ప్రముఖనాయకులలో ఆజాద్ ఒకరు. మేధావి, పత్రికా సంపాదకుడు, రచయిత, నాయకుడు, మంచివక్త, అన్నింటికంటె మించి గొప్పదేశభక్తుడు.స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటి విద్యాశాఖామంత్రిగా దేశానికి విశిష్టసేవలనందించిన మహనీయుడు.

1888,నవంబరు-11న ఆలియాబేగమ్, ఖైరుద్దీన్ పుణ్యదంపతులకు మక్కాలో జన్మించాడు.బాల్యం అరేబియాలో గడిపారు. ఖైరుద్దీన్ మక్కా వదలి 1890లో సకుటుంబంగా కలకత్తా చేరుకున్నాడు. ఒక సంవత్సరం తరువాత మౌలానా తల్లి మరణించింది.

**విద్యాభ్యాసం :** మౌలానా తండ్రి ఖైరుద్దీన్‌కు పాశ్చాత్యవిద్యలపట్ల విశ్వాసంలేదు. అందుకే మౌలానాకు ఆధునిక విద్యలు నేర్పించలేదు. తానే స్వయంగా చదువు నేర్పేవాడు. మతవిద్యలలో ప్రవీణలైన వారిని పిలిచి, వారిచేత మౌలానాకు విద్య నేర్పించాడు. పదహారు సంవత్సరాలు నిండేనాటికి ఆ విద్యలన్నీ పూర్తిచేశాడు. ఆధునిక విద్యలను గూర్చి సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు మౌలానాను ఆకర్షించాయి.ఆధునిక ప్రపంచంలో విద్యావంతుడు అనిపించుకోవాలంటే ఆధునిక విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం, సాహిత్యం అభ్యసించాలని ఆయన గ్రహించాడు. ఇంగ్లీషు చదువుకోవటానికి నిర్ణయించుకున్నాడు. కొంత భాషాజ్ఞానం అబ్బిన తరువాత మౌలానా బైబిలును చదవడం మొదలు పెట్టాడు. ఇంగ్లీషు పత్రికలను నిఘంటు సాయంతో చదవడం ప్రారంభించాడు. ఇంగ్లీషు, పర్షియన్, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. చరిత్ర-వేదాంత గ్రంథాలను కూడా మౌలానా చదివాడు.

**<u>ఖైరుద్దీన్ అబుల్ కలామ్ ఆజాద్‌గా ఎలా మారాడు?</u>**

“అబుల్ కలామ్” అంటే “జ్ఞాని” అని అర్థం. అన్ని తెలిసినవాడు అని. మేధావులలో మేటి అని అర్థం. అందుకే అందరూ అబుల్ కలామ్ అని పిలిచేవారు. (Learned man)

మౌలానాకు తన కుటుంబంలోని ఛాందసభావాలు, ఆచారాలు అంతగా నచ్చేవికావు. వీటిపై తిరుగుబాటు చేయాలనే కోరిక ఉండేది. చివరకు వంశపారంపర్యమైన సంప్రదాయాలను ఛేదించి, అప్పటినుంచి ఆయన ‘ఆజాద్’ అంటే ‘స్వతంత్ర’ అనే అన్వర్థనామాన్ని తన కలం పేరుగా స్వీకరించటానికి నిర్ణయించుకున్నాడు. ఆనాటి నుండి ఆయన “మౌలానా అబుల్ కలామ్ ఆజాద్”గా వినుతికెక్కాడు.

**<u>పత్రికా నిర్వహణ :</u>** ప్రజల్లో చైతన్యం కలిగించటానికి 1912వ సంవత్సరంలో ‘ఆల్ హిలాల్’ పత్రిక స్థాపించారు.బ్రిటిష్ ప్రభుత్వానికి ఈ పత్రిక నచ్చలేదు.ఎన్నో ఇబ్బందులు కలిగించింది.1915లో ‘ఆల్ హిలాల్’ ప్రెస్సును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.అయినా ఆజాద్ ఏ మాత్రం వెనుకంజవేయక ‘ఆల్ బలాగ్’ అనే పేరుతో మరో పత్రికను ప్రారంభించాడు. మరల బ్రిటిష్ ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు విధించి, మౌలానాను జైలుపాలుజేసింది.

## స్వాతంత్ర్యోద్యమంలో ఆజాద్ పాత్ర :

స్వాతంత్ర్యోద్యమంలో ఆజాద్ ప్రముఖపాత్ర పోషించాడు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం, సహాయనిరాకరణోద్యమం, క్విట్ఇండియా ఉద్యమం వంటి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. జైలునుండి విడుదలైన ఆజాద్ 1920 జనవరిలో ఢిల్లీలో గాంధీజీ దర్శనం చేసుకున్నాడు. మీరట్‌లో ఖిలాఫత్ మహాసభ జరిగింది. ఆ వేదిక నుంచే గాంధీ మొట్టమొదటిసారి సహాయనిరాకరణ కార్యక్రమాన్ని బహిరంగంగా ప్రబోధించాడు. ఆయన మాట్లాడాక కార్యక్రమాన్ని బలపరుస్తూ ఆజాద్ మాట్లాడాడు. ఆజాద్ గాంధీజీ వెంట దేశమంతా తిరిగి ప్రచారం చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం దేశమంతా నాయకులను అరెస్టు చేయడం మొదలుపెట్టారు. ఆజాద్‌ను కూడా అరెస్టుచేసి అలిపురం సెంట్రల్ జైలులో ఉంచారు. అది రాజకీయ చర్చలకు నిలయమైంది.

1928లో సైమన్ కమీషన్ నియామక సందర్భంలో, 1929లో కాంగ్రెస్ మహాసభ 'పూర్ణస్వాతంత్ర్యం' తీర్మానాన్ని ఆమోదించిన సందర్భంలో ఆజాద్ పాత్ర ప్రశంసనీయమైనది. 1930లో ఉప్పు చట్టాల ఉల్లంఘన మొదలైంది. ఆ సందర్భంలో మీరట్‌లో ఉపన్యసించిన ఆజాద్‌ను ప్రభుత్వం అరెస్టు చేసింది. అతి చిన్నవయస్సులో అనగా 35 సంవత్సరాల వయస్సులోనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులై దేశానికి ఎంతో సేవచేశారు.

భారతజాతీయ ఉద్యమనాయకుల్లో విద్వేషాలు కలిగించటానికి బ్రిటిష్ ప్రభుత్వం హిందూ-ముస్లింల మధ్య వైషమ్యాలు కలిగిస్తే మౌలానా అప్పుడు హిందూ-ముస్లింల మధ్య ఐక్యతకు కృషిచేశాడు. ఈవిధంగా మౌలానా స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖపాత్ర పోషించాడని చెప్పవచ్చు.

**విద్యాశాఖామంత్రిగా మౌలానా పాత్ర :**

మౌలానా స్వతంత్రభారతదేశానికి మొట్టమొదటి విద్యాశాఖామంత్రిగా 11 సంవత్సరాలు విశిష్ట సేవలనందించారు. ఒక పండితుడు, మహామేధావి అయిన వ్యక్తి విద్యాశాఖామంత్రిగా ఉండటం దేశప్రజలు చేసుకున్న అదృష్టం. విద్యామంత్రిగా ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారు. విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషిచేశారు. సమగ్ర ప్రణాళికలు ఏర్పాటుచేశారు.

**ఆజాద్ వ్యక్తిత్వం :**

1. 'ఆజాద్ ఒక తేజోవంతమైన మహావ్యక్తి' అన్నారు నెహ్రూ.
2. 'ఆజాద్ వ్యక్తి జీవితంలో కరుణాసముద్రుడనీ, ప్రజాహిత జీవితంలో అకుంఠిత దీక్షాపరుడు' అని సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు.
3. 'బ్రిటిష్ సామ్రాజ్య భావమే మాకు విరోధి. బ్రిటిష్ ప్రజలతో మాకు వైరం లేదు' అని చాటిన ఘనుడు ఆజాద్.